
సాక్షి
గుంటూరు
శనివారం। 2। మార్చి। 2024



పోలీస్ కుటుంబాలకు చెక్కులు

నగరంపాలెం: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఫ్లాగ్ ఫండ్ రూ.75 వేలు, కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ కుడికాలువకు 6,006 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా శోభన్ బాబు



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య కె శోభన్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మ్యాథమెటిక్స్ విభాగం ఆచార్యులుగా పనిచేశారు.

న్యూస్‌రీల్

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు తాగు నీటి అవసరాల నిమిత్తం కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈ రఘునాథ్‌రావు, డీఈ గాయత్రి పర్యవేక్షణలో శుక్రవారం నీటిని విడుదల చేశారు. కుడి కాలువకు 5, 7వ గేటు ద్వారా ఉదయం 10.30 గంటలకు గేటుకు 1,000 క్యూసెక్కుల చొప్పున రెండు గేట్ల ద్వారా 2వేల క్యూసెక్కులను విడుదల చేశారు. కుడి కాలువకు గంటకు 2 గేట్ల ద్వారా 2,000 క్యూసెక్కుల చొప్పున పెంచుతూ మధ్యాహ్నం 1.30 గంటలకు 6,000 క్యూసెక్కులను విడుదల చేశారు. 9 రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్ ప్రాజెక్టు ఈఈ శ్రీహరి, డీఈ మురళీధర్, జేఈలు బాబుమియా, సుధ, సాగర్‌ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి గ్రీవెన్స్ డే



నగరంపాలెం: పోలీస్ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పలువురు ఉద్యోగులు, మినిస్ట్రీరియల్ సిబ్బందితో మాట్లాడారు. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పలువురు వ్యక్తం చేసిన సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలపై పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

రేపటి వరకు ఈ–క్రాప్‌పై సామాజిక తనిఖీ

కొరిటిపాడు(గుంటూరు): రబీకి సంబంధించిన ఈ–క్రాప్ నమోదుపై ఆదివారం వరకు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీ కొనసాగిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఈ–క్రాప్ తుది ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనరేట్‌కు పంపుతామని పేర్కొన్నారు. ఈ రబీలో అన్ని పంటలు కలిపి 1,57,465 ఎకరాలలో పంటలు సాగులోకి వచ్చినట్లు ఈ–క్రాప్ ద్వారా స్పష్టమవుతోందని తెలిపారు. ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, మినుము, మంచి శనగ, పెసర తదితర పంటలు సాగులోకి వచ్చాయని పేర్కొన్నారు. రైతు భరోసా సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ గ్రామానా ఆదివారం సాయంత్రం వరకు ఈ–క్రాప్ సామాజిక తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు. పొరపాట్లు ఉంటే సవరించుకోవాలని కోరారు. రబీ సీజన్ పంట నమోదులో సవరణ కోసం ఇది చివరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులు చేయబడవని ఆయన రైతులకు సూచించారు.

కార్తికేయునికి వెండి నాగ పడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి నరసరావుపేటకు చెందిన భక్తులు అనుమోలు జగదీష్‌కుమార్ 570 గ్రాములతో చేసిన వెండి నాగపడగను సమర్పించారు. శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న ఆయన వెండి పడగను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం జగదీష్‌కుమార్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 1,39,573 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,21,485 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,39,573 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 20,700 వరకు లభించింది.

మురిపించే పింఛన్

చంద్రబాబు స్వార్థ రాజకీయాలు, అనాలోచిత నిర్ణయాల వల్ల రాజధాని ప్రాంతంలో వేలాది మంది పేదలు ఉపాధి కోల్పోయారు. పేదల ఆందోళన ఫలితంగా పింఛన్ రూ.2,500 ఇచ్చేందుకు అంగీకరించిన టీడీపీ ప్రభుత్వం అందులోనూ వివక్ష చూపింది. తన వారికే వడ్డించింది. ఇటీవల ఫిరంగిపురంలో జరిగిన సభలో పేదల కష్టాలు విన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ రూ.5000లకు పెంచుతూ జీవో విడుదల చేశారు. పెంచిన పింఛన్‌ను శుక్రవారం అందుకున్న పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- రాజధానిలో భూమిలేని నిరుపేదల పింఛన్ పెంపు
- రూ.2500 నుంచి రూ.5000 చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల
- ఫిరంగిపురం సభలో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- 17,215 మంది భూమిలేని నిరుపేదలకు లబ్ధి
- రాజధాని కూలీల్లో హర్షం



తుళ్లూరులో రాజధాని రైతు కూలీలకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

తాడికొండ: గత ప్రభుత్వ హయాంలో భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయాలని పలుమార్లు రైతు కూలీలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు నాడు పోరాటం చేయగా అరకొరగా చేయి విదిల్చిన చంద్రబాబు రూ.2500 పింఛన్ ఇచ్చేందుకు అంగీకరించారు. 10 సంవత్సరాలుగా దానిని పెంచిన దాఖలాలు లేకపోవడంతో రైతు కూలీలు ఇటు ఉపాధి లేక, అటు ప్రభుత్వం అందించే పింఛన్ చాలక నానా ఇబ్బందులు పడ్డారు. పింఛన్ సొమ్ము రూ.2500ను రూ.5000లకు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం నుంచి పెంచిన పింఛన్ సొమ్ము చెల్లించనున్న నేపథ్యంలో తమకు ఆర్థిక బాధలు తొలగనున్నాయని వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతు కూలీలు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీని వలన రాజధాని 29 గ్రామాల్లో భూమిలేని నిరుపేద కుటుంబాలకు చెందిన 17215 కుటుంబాలు లబ్ధి పొందనున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపరంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు అందించే జీవన భృతి పింఛన్లు చాలడం లేదని, వారికి రూ.5000 అందించాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సభలో కోరగా స్పందించిన సీఎం వెంటనే ఆ హామీ నెరవేర్చుతున్నట్లు సభలో ప్రకటించారు. 15 రోజుల్లోనే హామీని నెరవేర్చి రాజధాని ప్రాంతంలో నిరుపేద కుటుంబాల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. తమకు మేలు చేసిన జగనన్నకు జేజేలు పలుకుతున్నారు. తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరులో శుక్రవారం నిర్వహించిన సభలో రైతు కూలీలకు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని నిడమర్రు, యర్రబాలెంలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, సమన్వయకర్త గంజి చిరంజీవి పింఛన్ నగదు అందజేశారు.



నిడమర్రులో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా రైతు కూలీలు

టీడీపీ హయాంలో ఒక్కొక్కరికి ఓ న్యాయం



తెలుగుదేశం పార్టీ హయాంలో పేదలకో న్యాయం, పెత్తందారులకో మరో న్యాయం జరిగింది. రైతులకు, అసైన్డ్ రైతులకో ప్యాకేజీ ఇచ్చి వ్యవసాయ కూలీలను మాత్రం నిలువునా మోసం చేశాడు. ఇక్కడ ఉపాధి లేక పనుల కోసం పక్క ప్రాంతాలకు వలస వెళ్లి కడుపు నింపుకున్నాం. మాకిచ్చిన జీవన భృతి పింఛన్ కూడా అప్పటి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకొస్తే గానీ ఇవ్వలేదు.

– పఠాన్ చాంద్ బీ, మందడం

జగనన్నకు ధన్యవాదాలు



రైతులతోపాటు జీవన భృతి పింఛన్ కూడా పెంచుతూ పోతే మాకు కూడా లబ్ధి జరిగేది కానీ బాబు మాత్రం తమ సామాజిక వర్గానికి మాత్రమే లబ్ధి చేకూర్చి మాలాంటి పేదలకు మాత్రం అరకొరగా ఎంగిలి చేతిని విదిలించి మోసం చేశాడు. మాకు మేలు చేసేలా పింఛన్ రూ.5000 చేసిన జగనన్నకు ధన్యవాదాలు

– పఠాన్ నాగుల్ బీ, మందడం

బాబు పేదల ఉసురు పోసుకున్నారు



అమరావతి పేరుతో అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు ఈ ప్రాంతంలో మూడు పంటలు పండే భూములు తీసుకోవడంతో అడవిలా మారింది. ఉపాధి లేకుండా చేసిన కారణంగా మాకు జీవనం నానా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు జగనన్న రూ.5000కు పెంచి మాకు మేలు చేశాడు. బాబు చేసిన నిర్వాహకం కారణంగా పడ్డ పాట్లు అంతా ఇంతా కాదు అభివృద్ధి చేయకపోగా అడవిలా మార్చి మా ఉసురు పోసుకున్నారు.

– చలివేంద్రం లక్ష్మి, వెలగపూడి

జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

రూ.61.20 లక్షల నిధులు మంజూరు

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు జిల్లా ప్రజా పరిషత్ నిధులు విడుదల చేసింది. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా సూచనలతో రూ.61,20,225 నిధులు మంజూరుచేస్తూ జెడ్పీ సీఈవో వసంత రాయుడు గురువారం ఉత్తర్వులు విడుదలచేశారు. గతేడాది గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 25 వేల మంది జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.50 లక్షల జెడ్పీ నిధులతో నెలరోజులపాటు అల్పాహారాన్ని అందజేయగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 27,201మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు రూ.61.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. జనవరి 30న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: గుంటూరు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే క్రమంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రైయిన్ మీదుగా వెళ్లే పైపులైన్లు పక్కకు మార్చడంతోపాటు లీకులకు మరమ్మతులు చేస్తున్నామన్నారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు.



క్యాంపు కార్యాలయంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కమల

మంగళగిరి సమన్వయకర్తగా మురుగుడు లావణ్య

తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా మురుగుడు లావణ్య నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మురుగుడు లావణ్య తల్లి మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల కాగా, మామ ప్రస్తుత ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మురుగుడు లావణ్యలు కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుటుంబంతో కమలకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మురుగుడు హనుమంతరావు, కాండ్రు కమల కుటుంబం నుంచి వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా లావణ్య రావడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. 1987లో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో మంగళగిరి మున్సిపల్ చైర్మన్‌గా మురుగుడు హనుమంతరావు పోటీ చేసి ఎన్నికయ్యారు. 1999 నుంచి 2004 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2004లో మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ప్రస్తుతం ఎమ్మెల్సీగా, ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. లావణ్య తల్లి కాండ్రు కమల 2004 నుంచి 2009 వరకు మంగళగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం టీటీడీ బోర్డు మెంబర్‌గా పనిచేశారు.

వ్యవస్థలో మహా విప్లవం విద్యా విధానం



విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- 37,064 మంది ఖాతాల్లో విద్యా దీవెన నిధులు రూ.31.28 కోట్లు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

గుంటూరు వెస్ట్: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సాయమందించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలు దేశానికే ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా దీవెన 2023–24 తొలి త్రైమాసిక నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు వర్చువల్ విధానంలో హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం అందిస్తున్న విద్యా దీవెన పథకం డబ్బుతో ఎంతో మంది ఉన్నత విద్యనభ్యసించి గొప్ప గొప్ప స్థానాలకు చేరుకున్నారన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వ సాయంతో పేదరికాన్ని విద్య ద్వారా జయించారన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 37,064 మంది విద్యార్థులకు సంబంధించి 33,145 మంది తల్లుల ఖాతాల్లోకి నేరుగా రూ.31.28 కోట్లు జమయ్యాయన్నారు. ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రూ.598 కోట్లు విద్యార్థులకు అందాయని చెప్పారు. ఇది ఒక విధంగా చాలా గొప్ప విషయమన్నారు. అనంతరం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ విద్యార్థులకు నమూనా చెక్కు అందజేశారు.

ఆడపడుచులకే అగ్రతాంబూలం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ చేయూత ద్వారా ఆత్మ గౌరవం పెంచారు
- పిల్లలను చదివించే తల్లులకు నగదు ప్రోత్సాహం ఇస్తున్నాం
- ఇబ్బందుల్లో, అవసరాల్లో అండగా ఉంటున్న ప్రభుత్వం మనదే
- మిర్చియార్డు కూలీల కష్ట సుఖాలపై ఆరా



మిరప తొడిమెలు తీసే మహిళా కూలీలతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆడపడుచులకే అగ్రతాంబూలమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నల్లపాడు రోడ్డులోని కారం మిల్లులకు సంబంధించి ఎండు మిరప కాయల తొడిమెలు ఒలిచే కూలీలను మంత్రి విడదల రజిని శుక్రవారం ప్రత్యేకంగా కలుసుకున్నారు. వారితో కలిసి కూర్చుని కొద్దిసేపు తొడిమెలు తీశారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరు గురించి ఆరా తీశారు. సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు బాగున్నాయా.. అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా ఆశిస్తున్నారా..? అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి రజిని మాట్లాడుతూ మహిళలకు అన్నివిధాలా అండగా ఉంటూ వారిని ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళుతున్న గొప్ప ప్రభుత్వం జగనన్నదని కొనియాడారు. మహిళల ఆత్మ గౌరవం పెంచేలా సీఎం వైఎస్ జగన్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. పిల్లలను చదివించుకునే పేద తల్లులకు జగనన్న ఏటా రూ.15 వేలు అమ్మ ఒడి పథకం కింద అందిస్తున్నారని, మన ఇబ్బందుల్లో, మన అవసరాల్లో మనకు పూర్తిగా అండగా ఉంటున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. మహిళలకు ఏం కావాలన్నా ఇంకా మరింతగా సంక్షేమాన్ని అందించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.



ఊయలలో పసిబిడ్డ ఆలనాపాలన గురించి తెలుసుకుంటున్న మంత్రి విడదల రజిని

మిర్చి ఘాటును సైతం లెక్క చేయకుండా...

మిర్చి కోరు, ఘాటును కూడా లెక్క చేయకుండా మంత్రి విడదల రజిని మిర్చి తొడిమెలు తీసే షెడ్లలో ఆ మహిళలతో కొద్దిసేపు తొడిమెలు ఒలిచారు. మిర్చి రాసులు మధ్యనే కూర్చుని సుమారు గంటకుపైగా వారితో మమేకమై వారి సాధక బాధకాలను ఆలకించారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు ఆ మిర్చి కోరు మధ్యే తమ పిల్లలను చీరలతో ఊయలలు వేసి అక్కడే పడుకోబెట్టి సాకడం చూసి కలత చెందారు. ఆ బిడ్డలను చేతిలోకి తీసుకుని ముద్దాడారు. మంత్రి రజిని ఒక సామాన్యురాలిలా తమతో కలసిపోవడం చూసిన అక్కడి మహిళలంతా ఆనందంతో ఆమెకు జేజేలు పలికారు. మంత్రి వెంట ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, ఆయా క్లస్టర్ల ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీలర్లు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- జూనియర్ విద్యార్థులు 97.8 శాతం హాజరు
- గుంటూరులోని ఏసీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



గుంటూరు ఏసీ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షకు హాజరైన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం గుంటూరు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు 97.8 శాతం హాజరు నమోదైంది. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారు. జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగా చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చర్యలతో విద్యార్థులు ఆందోళనకు తావులేకుండా సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 92 పరీక్ష కేంద్రాల పరిధిలో పరీక్షలకు దరఖాస్తు చేసిన 32,498 మంది విద్యార్థులకు 31,718 మంది హాజరయ్యారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 పరీక్ష కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీ చేశాయి. అదే విధంగా హైపవర్, డీఈసీ, పోలీసు అధికారులు పలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లోకి హాల్ టికెట్ మినహా విద్యార్థులు మరే ఇతర సామగ్రిని తీసుకెళ్లనీయకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించబోమని అధికారులు పదే, పదే చేసిన హెచ్చరికలతో పాటు ఇంటర్మీడియెట్ బోర్డు మార్గదర్శకాలను హాల్ టికెట్లపై స్పష్టంగా పేర్కొన్న కారణంగా విద్యార్థులు ఉదయం 8.00 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం ప్రారంభించారు.

క్లుప్తంగా

ఎన్నికలు నిర్వహణ కమిటీలు కీలక పాత్ర

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలంటే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కమిటీ(ఎంసీసీ), డిస్ట్రిక్ట్ ఎక్స్‌పెండేచర్, మానటరింగ్ కమిటీలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సిబ్బంది శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రిటర్నింగ్ అధికారులకు పని కొంత అదనంగా ఉంటుందని చెప్పారు. ఎవరికి ఏ బాధ్యత అప్పగిస్తామో ఆ అధికారి వాటిని పూర్తిగా అర్థం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని అతిక్రమించకూడదనే నియమం పెట్టుకోవాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్నారు. అందుకే ముందుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. పార్లమెంట్ అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి రూ.40 లక్షలు అభ్యర్థులు ఖర్చు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఎంసీసీతో పాటు డిస్ట్రిక్ట్ ఎక్స్‌పెండేచర్, మానటరింగ్ కమిటీ వీటిని జాగ్రత్తగా గమనించాలని కోరారు. అనంతరం విధివిధానాలపై డీఆర్డీఏ పీడీ హరిహరనాథ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, కె.స్వాతి, రవీంద్ర రావు, ఆర్డీఓ పి.శ్రీకర్ పాల్గొన్నారు.


ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ఈనెల 5వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ పి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కుచట్టం ప్రకారం 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌లో సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ పలు మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఓసీలకు వర్తిస్తుందని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు ఎంఈవో కార్యాలయాలు, పాఠశాలల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఐదేళ్లు నిండిన పిల్లలకు ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న పాఠశాలల్లో ప్రవేశానికి సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాజధాని గ్రామాల్లో కూలీల ఆనందం



తెల్లవారుజామున రాజధాని రైతు కూలీల పెన్షన్ అందజేస్తున్న మహిళా వలంటీర్



పెనుమాకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతు కూలీలు

- తెల్లవారుజామునే రూ.5 వేల చొప్పున పింఛన్ అందజేత
- పలుచోట్ల సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాడేపల్లిరూరల్: భూమిని, రైతుని లేకుండా చేసి పెత్తందారులకు దోచిపెట్టేందుకు చంద్రబాబు కుట్ర చేశాడు. పేదలకు పని లేకుండా చేశాడు. పనికోసం పాకులాడిల్సిన దుస్థితి కల్పించాడు. కానీ వారందరికీ నేనున్నానంటూ.. అండగా నిలిచారు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. బాబు పాలనలో అన్యాయానికి గురైన పేదలకు మాట ఇచ్చి మడమతిప్పని మహోద్యమకారుడిగా వైఎస్ జగన్ నిలిచారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిరంగిపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజధాని రైతు కూలీల పెన్షన్‌ను మార్చి ఒకటో తేదీ నుంచి ఐదు వేల రూపాయలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆయన హామీ ఇచ్చిన విధంగా శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే రాజధాని పరిధిలో రైతు కూలీలకు ఇస్తున్న రూ.2,500 పెన్షన్‌కు బదులుగా రూ.5 వేలు పింఛన్‌ను వలంటీర్లు అందజేశారు. తాడేపల్లి రూరల్‌పరిధిలో ఉండవల్లి, పెనుమాక ప్రాంతాలు అప్పట్లో రాజధాని ప్రాంతంగా నిర్ణయించారు. పెనుమాకలో 1456, ఉండవల్లిలో 1404 మంది రైతుల కూలీల సామాజిక పెన్షన్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు సామాజిక పెన్షన్లతో పాటు రైతు కూలీల పెన్షన్లు కూడా తెల్లవారుజామున అందజేశారు. పెనుమాక, ఉండవల్లిలో రూ.71,50,000 పింఛన్ కింద ఇస్తుండగా ప్రస్తుతం పెరిగిన దానితో రూ.1,43,00,000 అందజేస్తున్నారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పెనుమాకలో ఎస్సీ కాలనీ, కొత్తూరు సెంటర్, ఉండవల్లి ఎస్సీ కాలనీ, ఉండవల్లి లొద్దు, ఉండవల్లి సెంటర్ తదితర ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షుడు మేకా దామేశ్వర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్క ప్రసన్న(నాని), భవనం రవీంద్రరెడ్డి, సచివాలయ కన్వీనర్లు షేక్ బషీర్,పులి భుజంగరావు, విలియం, ఆనందరావు, రవి పాల్గొన్నారు.

రైతు కూలీలకు న్యాయం



రాజధాని ప్రాంతంలో మాకు న్యాయం జరిగింది. గతంలో రూ.2500 ఇచ్చేవారు. ఆరు నెలలకు ఒక సారి 3 నెలలకు ఒకసారో బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయ్యేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రాజధాని కూలీల పెన్షన్లు అలాగే ఇచ్చేవారు. 2023 జనవరి నుంచి స్థానిక ఎమ్మెల్యే ఆర్కే చొరవ వల్ల వలంటీర్లే ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.ఐదు వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది.

–ఎస్‌కే షాహీరా బేగం

వైఎస్సార్ లానే పేదల పక్షాన



దివంగత నేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి లాగానే ఆయన కొడుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలు, మహిళల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటివద్దకే పెన్షన్లు అందజేస్తున్నారు. జగన్ బాబు ముఖ్యమంత్రి అయిన తరువాత రాజధాని కూలీల పెన్షన్ల కోసం గతంలో లాగా ఇబ్బంది పడడం లేదు. వలంటీర్లు ఇంటికే తీసుకొచ్చి ఇస్తున్నారు. ఆయన చెప్పిన విధంగా ఈ నెల నుంచి 5 వేల రూపాయలు పెన్షన్ ఇచ్చారు.

–షేక్ హుస్సేన్ బీ

మాట నిలబెట్టుకున్నారు




ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. వలంటీర్ ఇటీవల వచ్చి రాజధాని కూలీలకు పింఛన్ పెంచారని చెప్పగానే కొంచెం ఆనందం వేసింది. ఇస్తారా ఇవ్వరా అని అనుమానంగా ఉండేది. అయితే సీఎం చెప్పిన విధంగానే తెల్లవారుజామునే వచ్చి పింఛన్ రూ.5 వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది.

–షేక్ ఖాసిం బీ

ఐఎఫ్‌పీ ప్యానెల్స్ వినియోగంపై అవగాహన

గుంటూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌లో రిమోట్ మేనేజ్మెంట్ సాఫ్ట్ వేర్‌ను ఇన్స్టాల్ చేసేందుకు నూతన రిమోట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 252 పాఠశాలల్లో 1299 ఐఎఫ్‌పీ ప్యానల్స్, 178 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిలో నూతనంగా వస్తున్న రిమోట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్(ఆర్ఎంఎస్)ఇన్‌స్టాల్ చేసి ఉపాధ్యాయులకు నూతన సాఫ్ట్‌వేర్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఉపయోగించి డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి బోధన చేయాలని సూచించారు. దీని ద్వారా బోధన సులభతరం అవుతుందని, విద్యార్థులు కూడా సులభంగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. టోఫెల్ ఆంగ్ల భాష బోధనకు ప్రతి ఒక్క ఉపాధ్యాయులు ఒక విద్యార్థిని దత్తత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వి.వెంకటేశ్వరరావు, కే నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్, రాయల సుబ్బారావు ఐఎఫ్‌పీ ప్యానల్ ప్రోగ్రాం ఇన్‌చార్జి అంకమ్మ పాల్గొన్నారు.

జయం మనదే



పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ రథసారథిగా గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి వెంకట రోశయ్య అర్జునుడిగా ఎన్నికల కురుక్షేత్రంలో అడుగు పెట్టబోతున్నారు. తమ అమ్ములపొది నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన నవరత్న పథకాలను గెలుపు బాణాలుగా సంధించేందుకు 'సిద్ధం'అయ్యారు. ప్రసన్నాంజనేయుని నిండు ఆశీస్సులతో మరోసారి పొన్నూరు కోటలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు ఇప్పటి నుంచే 'వ్యూహం' పన్నుతున్నారు. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త రోశయ్యను శుక్రవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెదకాకాని మల్లేశ్వరుని సాక్షిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను పొన్నూరు గడపకు తోరణంగా కట్టేందుకు 'సిద్ధం'అయ్యారు. అంబటి మురళీకృష్ణను అక్కడ ఎమ్మెల్యేగా ప్రజలతో మమేకమైన కిలారి రోశయ్య భుజంతట్టి ప్రోత్సహించారు. జయం మనదే అంటూ మీడియా ఎదుట విజయ సారథులుగా కనిపించారు.

– పొన్నూరు

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా భాస్కరరావు



నూతనంగా ఎన్నికైన వైద్యుల కమిటీకి అభినందనలు తెలుపుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ గుంటూరు మెడికల్ కాలేజీ అధ్యక్షుడిగా జీజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ చందా భాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు శుక్రవారం నూతనంగా ఎన్నికైన డాక్టర్స్ అసోసియేషన్ నేతలు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలిసి నూతన కమిటీ వివరాలను అందజేశారు. జనరల్ సెక్రటరీగా జీజీహెచ్ ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.స్వరూప్‌కాంత్, కోశాధికారిగా ఎనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఇందిరప్రియదర్శిని ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్స్‌గా ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్, సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగసంతోష్‌కుమార్, సివిల్ అసిస్టెంట్ సర్జర్ జ్యోతుల మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ సి.వాసవి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ పి.రాజ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ కె.సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వైద్యులు పి.ఎస్.ఉషారాణి, పి.తబిత, ఆర్.జె.చంద్రిక, పి.నందకుమార్, పి.సుధారాణి, క్రీస్తు దాస్, కె.మాధవి, వై.రవీంద్రకుమార్, వి.శివరామ్‌ప్రసాద్, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు, జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ వి.రంగారెడ్డి, బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సి.హెచ్.భానుకుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి.శైలజ, ఎన్నికల సెంట్రల్ అబ్జర్వర్ ఐ.బాబ్జి శ్యామ్‌కుమార్‌లు నూతనంగా ఎన్నికై న వైద్యుల కమిటీని అధికారులకు పరిచయం చేసి అభినందనలు తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- మృతుల్లో చిన్నారి సహా ఇద్దరు మహిళలు
- ఓవర్‌టేక్ చేయబోతూ ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు



ఘటనా స్థలిలో మృతి చెందిన పావని, శ్యామ్

గుంటూరురూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడిన ఘటన గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు గార్లపాటి శ్రీను నల్లపాడు పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగరం గండాలయ్యపేటకు చెందిన గార్లపాటి సుబ్బమ్మ, ఆమె తోడు కోడళ్లు గార్లపాటి నాగలక్ష్మి, గార్లపాటి రాధ, నాగలక్ష్మి కుమార్తె గార్లపాటి పావని, సుబ్బమ్మ మనవడు గార్లపాటి శ్యాంబాబు పిడుగురాళ్ల మండలం జూలకల్లులో బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం గురువారం కారులో బయల్దేరి వెళ్లారు. కారును డ్రైవర్ శ్రీకాంత్ నడుపుతున్నాడు. శుభకార్యం ముగిసిన అనంతరం రాత్రి పది గంటల సమయంలో జూలకల్లు నుంచి మంగళగిరికి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో అర్ధరాత్రి దాటుతుండగా ఎన్‌హెచ్–16లో బొంతపాడు వద్ద ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ శ్రీకాంత్ ఓవర్ టేక్ చేయబోయాడు. అనుకోకుండా మితిమీరిన వేగంతో ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో గార్లపాటి పావని (17), గార్లపాటి సుబ్బమ్మ(48), గార్లపాటి శ్యామ్(8) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనలో డ్రైవర్ శ్రీకాంత్‌తో పాటు మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ నిసార్‌బాషా, పోలీసులు మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి, బంధువులకు సమాచారమిచ్చారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాతకు గురవ్వడంతో గండాలయపేటలో విషాదచాయలు అలముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నల్లపాడు సీఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

నక్కల దాడిలో మనుబోతు మృతి

బొల్లాపల్లి: నక్కల దాడిలో మనుబోతు తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన మండల కేంద్ర సమీపంలోని బండ్లమోటు సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై అటవీ శాఖ బొల్లాపల్లి సెక్షన్ అధికారి ఎం.సురేంద్ర వివరణిస్తూ.. నక్కలదాడిలో మనుబోతు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు చెప్పారు. బండ్లమోటు పోలీసులు ఘటన ప్రాంతానికి చెరుకుని వన్యప్రాణి మృత దేహాన్ని పరిశీలించారు. పశు సంవర్థక వైద్యులు పంచనామా నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది అటవీ ప్రాంతంలో కలేబరాన్ని ఖననం చేసినట్లు బీట్ అధికారి తెలిపారు.

జీజీహెచ్ పరిపాలనాధికారిగా సుధారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డెప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న చిన్నం సుధారాణి శుక్రవారం విధుల్లో చేరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం ఈర్లపాడుకు చెందిన సుధారాణి ఏపీపీఎస్సీ ద్వారా తహసీల్దారుగా ఉద్యోగానికి ఎంపికై గుంటూరు, నాదెండ్ల, యడ్లపాడు, చెరుకుపల్లి, పి.వి.పాలెం, బాపట్ల తహసీల్దారుగా పనిచేశారు. పదోన్నతిపై డెప్యూటీ కలెక్టర్ హోదా పొంది తొలిసారిగా గుంటూరు జీజీహెచ్‌లో అడ్మినిస్ట్రేటర్‌గా విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా రెవెన్యూ డిపార్టుమెంట్‌కు చెందిన వారిని పరిపాలనా పరమైన అంశాల్లో వైద్యులకు తోడ్పాటునందించేందుకు డెప్యూటీ కలెక్టర్లను ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్లుగా నియమించింది. గతంలో ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వారిని గత ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలో, టీచింగ్ ఆస్పత్రులను బలోపేతం చేయడమే ధ్యేయంగా ఎంబీబీఎస్ చదివి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేసినవారిని అడ్మినిస్ట్రేటర్లుగా నియమించింది. వీరికి అదనంగా రెవెన్యూ డిపార్టుమెంట్ నుంచి డెప్యూటీ కలెక్టర్‌లను నియమించింది. ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు విధులు నిర్వహించనున్నటుపేర్కొన్నారు.

శిలాఫలకాల ధ్వంసం



రొంపిచర్ల: కర్లకుంట గ్రామంలోని రైతుభరోసా కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ శిలా ఫలకాలను గుర్తు తెలియని వ్యక్తం ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఉదయం ఆర్బీకేకు వచ్చిన వీఏఏ, పాఠశాల ఉపాధ్యాయులు విషయాన్ని గమనించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనం, మనబడి నాడు-నేడులో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాల ప్రారంభోత్సవాల శిలా ఫలకాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గతంలో ఆవిష్కరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కేపీ రవీంద్ర తెలిపారు.

లైఫ్@360



హెల్త్ టిప్స్



గుడ్డులోని తెల్లసొనను తినడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించుకోవచ్చు. దీన్ని తినడం వల్ల అన్ని రకాల గుండె సమస్యలను దూరం చేస్తుంది. ఈ క్రమంలో మీరు రోజూ తినే ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చు.



బాదం నూనెలో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు పోతుంది. ఒక గిన్నెలో కొద్దిగా బాదం నూనెను తీసుకొని.. అందులో కొద్దిగా నిమ్మ రసాన్ని మిక్స్ చేసి.. ఆ తర్వాత జుట్టుకు అప్లై చేయాలి. అలా కొద్దిసేపు చేతులతో తలపై మసాజ్ చేయాలి. మసాజ్ చేసిన తర్వాత అవసరమైతే.. గంట తర్వాత లేదా మరుసటి రోజు షాంపూతో మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.



నిద్ర లేచిన తర్వాత మీకు మెడ నొప్పిగా అనిపిస్తే.. నొప్పి ప్రభావిత ప్రాంతాల్లో ఐస్ ప్యాక్ లేదే చల్లని నీటిలో నింపిన క్లాత్ ను వేసి అద్దాలి. అలా చేయడం వల్ల మెడ కండరాల వాపు తగ్గుతుంది. దీంతో పాటు హీట్ ప్యాక్ ను ఉపయోగించవచ్చు. ఇది కూడా మెడ కండరాల నొప్పిని తగ్గిస్తుంది.

మెడ నొప్పిగా ఉన్న వాళ్లు చేతులతో మెడను నెమ్మదిగా మసాజ్ చేయాలి. అలా చేయడం వల్ల కండరాలు సర్దుకొని నొప్పి తగ్గే అవకాశం ఉంది. మసాజ్ చేసే సమయంలో కొబ్బరి లేదా నువ్వుల నూనె ఉపయోగిస్తే మేలు జరుగుతోంది. మెడ నొప్పిని నివారించేందుకు మీరు రాత్రిళ్లు బోర్లా పడుకోకుండా ఉంటే చాలు.

మంచి అలవాట్లు మెరుగైన ఆరోగ్యం

మంచి అలవాట్లు మన జీవితాలను మెరుగుపరుస్తాయి అని స్టీఫెన్ కోవీ తన '7 హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్'లో చెప్పాడు. అదే సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యకరమైన అలవాట్లు జీవనశైలి మన ఆరోగ్యాన్ని, శక్తి స్థాయిలని, పని చేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు జీవన శైలి వ్యాధులను నివారించడంలో కూడా తోడ్పడతాయి. ఇంతకీ ఆ అలవాట్లేమిటో తెలుసుకుందామా... ఎవరినైనా సరే, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే కొన్ని అలవాట్లు...

రోజును ముందుగానే ప్రారంభించటం...

తొందరగా నిద్ర లేవాలి, తొందరగా నిద్రపోవాలి అనే సూత్రాన్ని చాలామంది పాటిస్తుంటారు. అయితే ఈ సూత్రాన్ని పని చేసే రోజుల్లోనే అంటే వర్కింగ్ డేస్‌లో మాత్రమే పాటిస్తూ, సెలవ రోజుల్లో పక్కన పెట్టేస్తారు. అలా కాకుండా వారాంతాల్లోనూ, సెలవు రోజుల్లో కూడా సాధ్యమైనంత వరకు త్వరగా నిద్రలేచి త్వరగా మన దినచర్యను ప్రారంభించే అలవాటు స్వీయ క్రమశిక్షణకు చిహ్నం. అంతేకాదు, తొందరగా నిద్రలేవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారని అనేక పరిశోధనల్లో రుజువైంది కూడా.

సముద్రపు ఉప్పుకు మారండి

చిప్స్, బర్గర్‌ల నుండి వేపుళ్ల వరకు ప్రతిదీ ఉప్పుతో నిండి ఉంటుంది. వాటిని చాలా రుచికరమైనదిగా చేస్తుంది. మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, డీహైడ్రేషన్, హైపర్‌టెన్షన్, కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల అయోడైజ్డ్ సాల్ట్‌కు బదులు సముద్రపు ఉప్పు, రాక్ సాల్ట్ లేదా హిమాలయన్ పింక్ సాల్ట్‌కి మారండి, ఇవి ఆరోగ్యకరమైనవి.

ఆరోగ్యకరమైన అల్పాహారం

అల్పాహారం తీసుకోవడం అనేది రోజులో అత్యంత ముఖ్యమైన విషయం.. మీకు ఉదయం సమయం లేకపోతే, ఏవైనా పండ్లు లేదా కొన్ని గింజలను అయినా తీసుకోవచ్చు. ఆ తర్వాత పనిలో తినగలిగే అల్పాహారాన్ని ప్యాక్ చేసుకుని తీసుకెళ్లి తినాలి. అంతేకానీ, మొత్తంగా బ్రేక్ ఫాస్ట్‌ను బ్రేక్ చేయద్దు.

మంచి నిద్ర

శరీర సాధారణ పనితీరును, నాడీ వ్యవస్థను పునరుద్ధరించడానికి సహాయపడేవాటిలో నిద్ర కీలకమైనది.. నిద్ర లేకపోవడం వల్ల జీవనశైలిని నేరుగా ప్రభావితం చేసే మగత, అలసట, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిద్ర లేమి మెదడుపై నియంత్రణను కోల్పోయేలా చేస్తుంది. అందువల్ల రోజూ కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర పోవడం అవసరం. ఒకవేళ మీకు నిద్ర పట్టని సమస్య ఉంటే, ఏదైనా పుస్తకాన్ని చదవడం, చక్కటి సంగీతాన్ని వినడం, ధ్యానం చేయడం ద్వారా నిద్రపోయేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ ఫలితం లేకపోతే వైద్య సహాయం తీసుకోవాలి.

బాగా నీరు తాగడం

మన శరీరంలోని ప్రతి కణం, కణజాలం, ప్రతి అవయవానికి అవసరమైన మొత్తంలో నీరు తాగటం అవసరం. ఇతర పానీయాల కంటే తాగునీరు ఎల్లప్పుడూ మంచి ఎంపిక. హైడ్రేటెడ్ గా ఉండటానికి మీతో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉంచుకోవడం అవసరం. ప్రతి అరగంటకు ఒకసారి కొన్ని గుక్కల నీరు తాగడం మంచిది.

శుద్ధి చేసిన చక్కెరకు నో చెప్పండి

చక్కెరలో ఎటువంటి పోషకాలు లేవు. ఎందుకంటే ఇది ప్రాసెసింగ్ ద్వారా వెళుతుంది. ప్రాసెస్ చేసిన చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల మీ శరీరంలోని ముఖ్యమైన పోషకాలు క్షీణించడం ప్రారంభిస్తాయి. బదులుగా మినరల్ షుగర్, పామ్ షుగర్, బెల్లం లేదా తేనెకు మారడం మంచిది.

కనీస వ్యాయామం

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయలేరు. కానీ ఫిట్‌గా ఉండటానికి త్రిక్ యాక్టివ్‌గా ఉండటమే. ఫిట్‌గా ఉండేందుకు రోజుకు పదివేల అడుగులు వేయడం సరైనదని పరిశోధనలు చెబుతున్నాయి. మన కదలికలు తగినంతగా లేకపోతే, మనలో చురుకుదనం లోపిస్తుంది. కొవ్వు పేరుకునిపోతుంది. అందువల్ల భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నడిచేందుకు ప్రయత్నించండి. అదేవిధంగా తక్కువ దూరాలను చేరుకునేందుకు వాహనాలను ఉపయోగించడానికి బదులు నడిచి వెళ్లే అలవాటు చేసుకోవడం మంచిది.

నవ్వుతూ ఉండటం

మిమ్మల్ని మీరు పాజిటివ్ వైబ్స్‌తో నింపుకోవడానికి ఇదే సులభమైన పద్ధతి. నవ్వు లేని జీవితం శూన్యం. నవ్వు ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది మానసిక స్థితిని పెంచుతుంది, ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గిస్తుంది. అందుకే నవ్వండి, ఆరోగ్యంగా ఉండండి!

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం

రోజువారీ ఆహారంలో వివిధ రకాలైన పండ్లు, ఆకు కూరలు, మొలకలు, పప్పులు, మాంసం, పౌల్ట్రీ ఫుడ్, సీ ఫుడ్ ఉండాలి. మీ ఆహారంలో ప్రొటీన్లు, ఫైబర్లు, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగానూ, కార్బోహైడ్రేట్లు, క్యాలరీలు తక్కువగానూ ఉండేలా చూసుకోవాలి.అలాగే, మీరు మీ ఆహారాన్ని ఎలా తింటారు లేదా నమలాలి అనేది కూడా ముఖ్యమైన భాగం. ఆహారం జీర్ణం కావాలంటే 20–30 సార్లు నమలాలి.

టీ/కాఫీ తీసుకోవడం తగ్గించండి

పనిలో అనేక కప్పుల ప్రాసెస్ చేయబడిన కెఫిన్ తీసుకోవడం అనారోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. మిల్క్ పౌడర్, పంచదార, పైగా ఉడికించిన టీ, రెడీ మిక్స్ కాఫీ, అన్నీ క్యాలరీలతో నిండి ఉన్నాయి. అందువల్ల పూర్తిగా మానేయనక్కర లేదు కానీ పరిమితంగా తీసుకోవడం మంచిది.

పరిశుభ్రత పాటించడం

నోటిని శుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా స్నానం చేయడం, ఇంటిని, వంటిని, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చిన్న అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ సామాజిక జీవితాన్ని కూడా మెరుగుపరుస్తాయి.

బార్లీతో బోలెడన్ని సమస్యలు దూరం

వేసవి వచ్చేసింది... వేడితో అనేక సమస్యలు ఎదురవుతాయి. అన్నం తినాలనిపించదు, తినకపోతే ఆకలి. డీహైడ్రేషన్ సమస్యలు తప్పవు. అయితే వేసవిలో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీనీళ్లతో చెక్ పెట్టొచ్చు. కేవలం వేసవి సమస్యలకే కాదు... అనేక ఆరోగ్య సమస్యలకు బార్లీ బాగా పని చేస్తుంది. అదెలాగో చూద్దాం...

పూర్వం ఎవరికైనా జ్వరం వచ్చిందంటే నీరసం నుంచి కోలుకోవడానికి బార్లీ నీళ్లు, సగ్గుజావ తాగించేవాళ్లు పెద్దలు. ఇప్పుడు కూడా బార్లీ కనిపిస్తోంది కానీ, అక్కడక్కడా... అప్పుడప్పుడూ మాత్రమే. కేవలం జ్వరంలోనే కాదు, వేసవిలో బార్లీ వాడకం చాలా మంచిది. అదెలాగో చూద్దాం...



- వేసవిలో తిన్నది అరగక పోవడం సాధారణ సమస్య. అలాంటప్పుడు బార్లీ నీళ్లు తాగితే చాలా మంచిది. జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది
- పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్న, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే
- మధుమేహులకు కూడా బార్లీ చాలా మేలు చేస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయులను అదుపులో ఉంచుతుంది. ఇన్సులిన్ కూడా అదుపులోనే ఉంటుంది
- ఇక గర్భిణులు రోజూ బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు
- బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి
- మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ఉదయాన రోజూ గ్లాసుడు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. సూక్ష్మమైన రాళ్లు కూడా కరిగిపోతాయి.

సినిమా

ధ్రువ్‌కు జోడీగా..?


● అనుపమా పరమేశ్వరన్

తమిళ స్టార్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ధ్రువ్ విక్రమ్ హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనుంది. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు అనుపమా పరమేశ్వరన్‌ను తీసుకున్నారట. అనుపమాకి ఇటీవల మారి సెల్వరాజ్ ఈ కథను వినిపించగా, ఈ బ్యూటీ ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ టాక్. మరి.. ధ్రువ్ విక్రమ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 15న తమిళనాడులోని తూత్తుకూడిలో ప్రారంభం కానుందని సమాచారం.

జస్ట్ సూపర్ మేన్.. అంతే!

"కథ రాయడం మొదలుపెట్టి, తొలి డ్రాఫ్ట్ పూర్తి చేసేవరకూ నా సినిమాకు 'సూపర్‌మేన్: లెగసీ' అనే టైటిల్‌నే అనుకున్నాను. కానీ ఫైనల్ డ్రాఫ్ట్ పూర్తి చేశాక 'లెగసీ'ని వదిలేద్దామని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా సినిమా టైటిల్ జస్ట్ 'సూపర్‌మేన్'... అంతే. మా ఈ సూపర్‌మేన్ వచ్చే ఏడాది జూలై 11న మీ ముందుకు వస్తాడు'' అని సామాజిక మాధ్యమాల ద్వారా దర్శకుడు జేమ్స్ గన్ పేర్కొన్నారు. సూపర్‌మేన్ క్యారెక్టర్‌తో ఇప్పటివరకూ 'సూపర్‌మేన్' ఫ్రాంచైజీలను నిర్మించిన డీసీ స్టూడియోస్ తాజా సూపర్‌మేన్ చిత్రాన్ని నిర్మించనుంది. అయితే సూపర్‌మేన్‌ని కొత్త రకంగా చూపించనున్నారు జేమ్స్ గన్. ఇప్పటివరకూ వచ్చిన చిత్రాల్లో సూపర్‌మేన్ ధరించిన సూట్‌కి భిన్నంగా తాజా చిత్రంలోని సూపర్‌మేన్ సూట్ ఉంటుందట. కాగా ఈ మధ్యకాలంలో సూపర్‌మేన్ అంటే నటుడు హెన్రీ కవిల్ గుర్తొస్తారు. 2013 నుంచి 2021 వరకూ డీసీ స్టూడియోస్ నిర్మించిన సూపర్‌మేన్ చిత్రాల్లో టైటిల్ రోల్‌లో అద్భుతంగా ఒదిగిపోయారు హెన్రీ. కానీ, తాజా చిత్రంలో ఈ పాత్రను డేవిడ్ కోరెన్స్‌వెట్ చేయనున్నారు. "సూపర్‌మేన్ జీవితంలోని పూర్వ భాగంపై ఈ చిత్రం ఉంటుంది. ఈ పాత్రను హెన్రీ కవిల్ చేయలేడు. అందుకే డేవిడ్ కోరెన్స్‌వెట్‌ని తీసుకున్నాం'' అని జేమ్స్ గన్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటి వరకూ మూడు నాలుగు చిత్రాల్లో మాత్రమే నటించిన 30 ఏళ్ల డేవిడ్ కోరెన్స్‌వెట్‌కి 'సూపర్‌మేన్' చాన్స్ రావడం అనేది గొప్ప విషయం అని హాలీవుడ్ అంటోంది.


● డేవిడ్ కోరెన్స్‌వెట్

కాశీలో క్లాప్


● తమన్నా, సంపత్ నంది

ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి ఏ విధంగా రక్షిస్తాడు? అనే ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఓదెల 2'. 2022లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్. సింహా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ పై డి. మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్ నంది క్రియేటర్‌గా ఉన్న ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో జరిగింది. రెగ్యులర్ షూటింగ్‌ని కూడా కాశీలోనే ఆరంభించారు. తొలి సీన్‌కి సంపత్ నంది క్లాప్ కొట్టారు. "ఓదెల 2' గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ చిత్రకథ ఉంటుంది. క్యాస్టింగ్, కథ, వీఎఫ్‌ఎక్స్.. టోటల్‌గా మేకింగ్ పరంగా ఈ చిత్రం పెద్దగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

కొత్త పాయింట్‌తో తీశారనిపిస్తోంది

- రాజేంద్ర ప్రసాద్

విశ్వ కార్తికేయ, ఆయుషీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో..'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డా. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– "కలియుగం పట్టణంలో..' టైటిల్ కొత్తగా ఉంది. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోంది. నా 'ఆ నలుగురు' సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడు. ఇప్పుడు హీరోగా నటించాడు. ప్రేక్షకులు ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమాలో ఓ రోల్ చేస్తున్నాను'' అన్నారు. "మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి ఈ సినిమా తీశారు. చిత్రా శుక్లా ఓ స్పెషల్ రోల్ చేశారు'' అన్నారు విశ్వ కార్తికేయ. "మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు రమాకాంత్ రెడ్డి. "మా టీజర్, ట్రైలర్‌ను చూసి కథను అంచనా వేయలేరు. సినిమా అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణను కడపలోనే చేశాం'' అన్నారు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి. "సినిమా అంతా కడపలోనే తీయడం ఇదే తొలిసారి. కడప నుంచి ఓ మంచి నిర్మాత రాబోతున్నాడు'' అన్నారు దర్శకుడు నీలకంఠ.


● ఆయుషీ పటేల్, రాజేంద్ర ప్రసాద్, విశ్వ కార్తికేయ

ఎనిమిది భాషల్లో రికార్డు బ్రేక్

నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్యకృష్ణ, కాశీ విశ్వనాథ్ ముఖ్య తారలుగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పై చదలవాడ పద్మావతి నిర్మించిన చిత్రం 'రికార్డు బ్రేక్'. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో 8 భాషల్లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మళ్లీ పుట్టి వచ్చినవా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సాబు వర్గీస్ సంగీత సారథ్యంలో వరికుప్పల యాదగిరి ఈ పాటకు లిరిక్స్ అందించి, పాడారు. "అందరికీ నచ్చేలా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు చదలవాడ శ్రీనివాసరావు.


● కాశీ విశ్వనాథ్, చదలవాడ శ్రీనివాసరావు